క్లుప్తంగా

కార్మికులకు బోనస్ చెల్లించండి..



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించిన తరహాలో సోలార్ ప్లాంట్ కార్మికులకు బోనస్ చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మంగళవారం ఇల్లెందు సోలార్ ప్లాంట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ మాట్లాడుతూ... కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించిన తరహాలో సోలార్ కార్మికులకు సైతం బోనస్ చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని పీఆర్‌టీయూ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జూలూరుపాడు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ బృందం కలిసింది. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వ ధరకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఏలను విడుదల చేసి దీపావళి పండుగను ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆనందంగా జరుపుకునే విధంగా చూడాలన్నారు.

గురుకుల కళాశాలలో శంకరన్ జయంతి



రవీందర్



సత్యనారాయణ

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల (సీఓఈ) కళాశాలలో మంగళవారం గురుకుల వ్యవస్థాపకులు ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ పాపారావు, స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... శంకరన్ ఆశయ సాధనకు గురుకుల కృషి చేయాలని కోరారు.

జిల్లా కమిటీ ఎన్నిక..

స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల సత్యనారాయణను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై ఒప్పందం



కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో కోల్, ఓబీ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ కంపెనీ ప్రతినిధులు, ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికుల సమక్షంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం చర్చలు జరిపారు. ఎల్ఎస్ఎన్ ప్రతినిధులు శివ, రాజమోహన్‌రెడ్డిలతో ఐఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు కోరం సురేందర్, కేటీసీ అధ్యక్షుడు ముచ్చా సుధాకర్ కార్మికుల సమస్యలపై మాట్లాడారు. మొత్తం 25 సమస్యలపై చర్చించడం జరిగిందని కంపెనీ ప్రతినిధులు సమస్యల పరిష్కారానికి అంగీకరించారని నాయకులు తెలిపారు. కార్మికులకు వేతనాలు పెంచడం జరిగిందని, సాధ్యమైనంత త్వరగా బోనస్ వచ్చే నెల లేదంటే డిసెంబర్‌లో ఇచ్చే విధంగా ఒప్పందం చేయడం జరిగిందని పేర్కొన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రతీ కార్మికుడికి రూ.5వేలు అడ్వాన్స్ ఇచ్చి బోనస్‌లో కట్ చేయనున్నట్లు చెప్పారు. ట్యాంకర్ డ్రైవర్లకు కూడా ఓల్వో డ్రైవర్లతో సమానంగా వేతనం ఇస్తామని, అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులకు వారి జీతాలను ప్రకారం పెంచుతామని, పీఎఫ్ కూడా ఇప్పుడు రెండు నెలల సంస్థకు చెల్లించాము, ప్రతీనెల రెండు నెలల పీఎఫ్ డబ్బులు జమ చేస్తూ మొత్తం క్లియర్ చేస్తామన్నారు. క్రిస్మస్ పండుగకు అన్ని విభాగాల కార్మికులకు రెండు జతల బట్టలు ఇస్తానని ఒప్పందం కుదిరినట్లు నాయకులు వెల్లడించారు.

సమస్యలతో సతమతం

- పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అరకొర వసతులు
- 420 మంది విద్యార్థులకు 11 గదులే
- ఒకే గదిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పాఠాలు
- క్రీడామైదానం లేక నిరుత్సాహం
- డిసెంబర్12న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు



ఒకే తరగతి గదిలో కూర్చున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

పాల్వంచరూరల్: చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల సమస్యలు ఎవరికీ పట్టడం లేదు. అరకొర తరగతి గదులు, క్రీడామైదానం లేదు, ఒకే గదిలో ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సంవత్సరాలుగా సమస్యలు వేధిస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా కళాశాల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే. పాల్వంచ మండలం బస్వతారక కాలనీ గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల 1974 జనవరి 15న ఏర్పాటు చేశారు. ఈ కళాశాల నాడు ఏపీ ఎస్ఈబీ కేటీపీఎస్ యాజమాన్యం ఆధ్వర్యంలో నెలకొల్పగా అప్పటి సీఎం జలగం వెంగళరావు, అప్పటి విద్యాశాఖమంత్రి మండలి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే చేకూరి కాశయ్యల చేతులమీదుగా ప్రారంభించారు. తర్వాత కేటీపీఎస్ విస్తరణలో భాగంగా 2014లో మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో 2015వరకు కొనసాగింది. తర్వాత 2016 జనవరిలో సొంత భవనంలోకి మార్చారు. ప్రస్తుతం కళాశాలలో 420 మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. మొత్తం తరగతి గదులు 11 మాత్రమే ఉండటంతో ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులను ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠాలు చెప్తున్నారు. ఇలా ఒక్క గదిలో 30 మందికిపైగా కుర్చోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 27 తరగతి గదులు అవసరం.

ల్యాబ్‌కు గదులు లేవు...

కళాశాలలో అరకొర గదుల కారణంగా ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం విద్యార్థులకు తరగతి గదిలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న పరిస్థితి. ల్యాబ్‌కు ప్రత్యేక గదులు లేకపోవడంతో ల్యాబ్ సామగ్రి తరగతి గదిలో, వరండాలోనే ఉంటున్న దుస్థితి. ఇప్పటికైనా ల్యాబ్‌లకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

క్రీడామైదానం లేక ఆటలకు దూరం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరగతి గదులతోపాటు ప్రహరీ, క్రీడామైదానం లేకపోవడంతో విద్యార్థులకు క్రీడల పట్ల మక్కువ ఉన్నా క్రీడల్లో రాణించలేకపోతున్నారు.

వరండానే స్టోర్ రూం...

కళాశాలలో గదుల కొరత కారణంగా కుర్చీలు, విద్యార్థులు కూర్చునే బల్లలు తదితరుములు వరండాలోనే వేయడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. నూతన తరగతి గదులు నిర్మాణం చేస్తేనే వాటిని వినియోగించుకునే పరిస్థితి ఉంది. తరగతి గదుల కొరత కారణంగా భవనంపైన కూడా తరగతులను నిర్వహిస్తున్నారు.



వరండాలో నిరుపయోగంగా బల్లలు

ఐఏఎస్, ఎన్ఐఆర్‌లుగా పూర్వవిద్యార్థులు..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయి అధికారులు, ఎన్ఆర్ఐలుగా తీర్చిదిద్దింది. ఇక్కడ చదువుకున్న చంపలాల్, భారతినాయక్, ఐఏఎస్‌లుగా ఎదిగారు. గిరిధర్ ఐఎఫ్ఎస్ స్థాయికి వెళ్లారు. ఇంకా అనేకమంది ఎన్ఆర్ఐలు ఉన్నారు. డిసెంబర్ 12న కళాశాల 50 వార్షికోత్సవం సందర్భంగా కళాశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

అదనపు గదులు నిర్మించాలి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు తరగతి గదులు లేకపోవడంతో నిత్యం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే గదిలో ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు కలిసి కూర్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మించాలి.

– ఎస్‌కె.మహబూబీ, ఇంటర్ విద్యార్థిని

ఆటస్థలం, ల్యాబ్‌లకు గదులు లేవు..



కళాశాలలో క్రీడామైదానం లేకపోవడంతో విద్యార్థులకు ఆటలపై ఆసక్తి లేకుండా పోయింది. క్రీడామైదానం ఉంటే ప్రతీ గేమ్స్ పిరియడ్‌లో ఆడుకుంటాం. దీంతో క్రీడాపోటీల్లో పాల్గొని, రాణించే అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా సైన్స్ విద్యార్థులకు ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు కూడా లేవు. దీంతో ఇబ్బందిగా ఉంది.

– పి.బాలాజీ, ఇంటర్ విద్యార్థి

ప్రతిపాదనలు పంపించాం..



ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేక ఇబ్బందికరంగా ఉంది. అదనపు తరగతి గదులు, ల్యాబ్ గదుల నిర్మాణం కోసం పైఅధికారులకు ప్రతిపాదనలు పంపించాము. మంజూరు కాగానే నిర్మాణం ప్రారంభిస్తాం. దాతల సహకారంతో నాలుగు షెడ్లను నిర్మించాము.

– శంకర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆదివాసీ పోరాట యోధుడు భీం

ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భీం విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. భీం ఆశయాలను కొనసాగించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పాల్వంచరూరల్: గిరిజన ఆశ్రమ స్పోర్ట్స్ స్కూల్‌లో..

వీరయ్యకు సన్మానం..

కొత్తగూడెంటౌన్: తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను మంగళవారం రైట్ ఇన్ఫర్మేషన్ కమిటీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్‌రాజు, ప్రసన్నరెడ్డి, ఆదిత్యవర్ధన్, వాసాల మురళీమోహన్, మాడపాటి రేవంత్, ఎండీ అంజాద్, గంద్ర జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌లో సమస్యలపై వినతి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం కమ్యూనిటీ హాల్‌లో సమస్యలను పరిష్కరించాలని ఏరియా జీఎం శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. ఈ మేరకు మంగళవారం జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్ నిర్మించి ఎనిమిదేళ్లు అయిందని, ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేశారని, అయినా ఇంకా మంచి నీటి బోరు, పార్కింగ్, వాస్ బేషిన్, ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జీఎం వీలైనంత త్వరలో ఈ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుటిక రాజేశ్వరరావు, పిట్ కార్యదర్శులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

సుజాతనగర్: జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వ నమోదు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ పానిశెట్టి వెంకటేశ్వర్లు కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా రాజేష్ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో పత్తి రైతులు, వ్యాపార సముదాయాల వద్ద మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మున్సిపాలిటీ నుంచే జీతాలు ఇవ్వండి..

పాల్వంచ: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ డ్రైవర్లు, హెల్పర్లకు మున్సిపాలిటీ ద్వారానే జీతాలు ఇవ్వాలని పలు పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇతర మున్సిపాలిటీల్లో ఇస్తున్న మాదిరిగా కార్మికులకు గుర్తింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్, బీజేపీ అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, న్యూడెమొక్రసీ నాయకులు నిమ్మల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు గద్దల రమేష్, ఎస్‌కె.బాషా, కాపు సంఘం నాయకులు చిన్నంశెట్టి రంగారావు సంఘీభావం తెలిపారు. కాకటి హుస్సేన్, కార్తీక్, పార్వతి, రమణ, సరోజ, రాము పాల్గొన్నారు.

మునగ, వెదురు సాగుతో ప్రయోజనం

ఇల్లెందురూరల్: మునగ, వెదురు సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీడీఓ ధన్‌సింగ్ అన్నారు. మండలంలోని కొమరారం రైతు వేదికలో మంగళవారం మునగ, వెదురు సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. మునగ సాగు చిన్న సన్నకారు రైతులకు వరం లాంటిదని చెప్పారు. సాగుకు ముందుకొచ్చిన రైతులకు పిట్లు తవ్వడం, విత్తనాలు, ఎరువులు, మొక్కల సంరక్షణ, కూలీల ఖర్చు వంటి వాటిని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఒక ఎకరాకు వెయ్యి మొక్కలు నాటవచ్చని, రైతుకు రూ.75వేలు ఆదాయం వస్తుందన్నారు. ములక్కాయలు ముదిరిపోతే ఎండబెట్టిన మునగ గింజలతో వచ్చే నూనె, మునగ ఆకుతో కూడా అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. అలాగే పొలం గట్ల వెంట నాటుకున్న వెదురుతోనూ మంచి లాభాలు గడించవచ్చని వివరించారు. ఆసక్తి కలిగిన రైతులు వెంటనే సంబంధిత గ్రామపంచాయతీలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వెయ్యి ఎకరాల్లో మునగ సాగు చేయడమే లక్ష్యం..

టేకులపల్లి: మండలంలో వెయ్యి ఎకరాల్లో మునగ, వెదురు సాగు చేయడమే లక్ష్యం అని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మాట్లాడుతూ.. ఇప్పటికే 43 ఎకరాల్లో మునగ మొక్కలు వేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగి ఉండి సన్న కారు రైతులు ఆసక్తితో ముందుకు వస్తే ఉపాధి హామీ పథకం ద్వారా మునగ మొక్కలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ రాజశ్యామలాంబ సహిత మహాసుదర్శన యాగం

పాల్వంచ: పట్టణంలోని హెచ్ కన్వెన్షన్ హాల్‌లో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీశ్రీశ్రీ రాజశ్యామలాంబ సహిత శత చండీ పూర్వక మహాసుదర్శన యాగం కొనసాగుతోంది.

వేద పండితులు కందాల సింహాద్రి ఆనందకుమార్, ఇంద్రగంటి చైతన్య, కొడమంచిలి సత్యనారాయణ వర్మ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు యాగం నిర్వహించనున్నారు. మూడోరోజు మంగళవారం మహిళలు సౌందర్య లహరి సహస్ర పారాయణాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంతతికి చెందిన కమలా హారీస్ అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించాలని యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాగం పూజా కార్యక్రమంలో కొణిజర్ల కవిత, బచ్చు హరీశ, నాగ, కోలాటం నృత్యకారిణి శ్రీ లక్ష్మి, ధనలక్ష్మి, నిర్మల, కల్పన, రంగా సుష్మా, శ్వేత, వీరమ్మ, సుమ, సుజాత, కృష్ణవేణి, సునీత, శ్రీదేవి, కల్యాణి, స్రవంతి, తేజ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న మహిళలు

'సీతారామ' జలాలు ఇల్లెందుకు రావాల్సిందే..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పక్కన నాయకులు

ఇల్లెందు: దివంగత సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేసిన విధంగా దుమ్ముగూడెం ప్రాజెక్టును పునరుద్ధరించి కాల్వలు, పైప్‌లైన్ ద్వారా ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు తరలించాలని గోదావరి జలాల సాధన కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి నర్సయ్య, ఏపూరి బ్రహ్మం మాట్లాడుతూ...అఖిలపక్షం ఆధ్వర్యాన హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఇటీవల వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీంతో త్వరలోనే సీతారామ, దుమ్ముగూడెం ప్రాజెక్టు పని ప్రదేశాలను సందర్శించి పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన దుమ్ముగూడెం ప్రాజెక్టు ద్వారా సునాయసంగా ఇల్లెందుకు నీరు వచ్చే అవకాశం ఉన్నా బీఆర్ఎస్ హయాంలో ఎందుకు మార్చారో పరిశీలిస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు ఆలేటి కిరణ్, బంధం నాగయ్య, రాంసింగ్, ఎస్.రాజు, బుర్ర వెంకన్న, క్లింట్ రోచ్, బండారు మోహన్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



టేకులపల్లి: చుక్కాలబోడు రైతు వేదికలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ రవీంద్రరావు

ఇల్లెందురూరల్: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మిషన్ భగీరథ డివిజన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన తాగునీటి సరఫరా సిబ్బంది శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో మిషన్ భగీరథ పథకం నేటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాలేదన్నారు. నేటికీ పైపులైన్లు సరిచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు ఆయా గ్రామాలలో పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది గ్రిడ్ నుంచి వినియోగదారుని ఇంటి వరకు పైపులైన్ల వ్యవస్థపై నిరంతరం నిఘా పెట్టి లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని చెప్పారు. గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో ఉంటేనే మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన సిబ్బందికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుమలేష్ ఈఈ, డీఈ మురళీకృష్ణ, బాలాజీ, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

టేకులపల్లి: అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు అన్నారు. ఈ మేరకు టేకులపల్లి మండలం చుక్కాలబోడు రైతు వేదికలో నాలుగు రోజుల పాటు మల్టీ పర్పస్ వర్కర్లకు మంచినీటి సహాయకులుగా ఇచ్చిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ శిక్షణలో బోర్లకు వచ్చే సమస్య, మరమ్మతులు, ఎలక్ట్రికల్, పంపుల నిర్వహణ, పైపుల జాయింట్, ప్లంబింగ్, నీటి పరీక్షలు, పంపుల ఆన్ ఆఫ్ తదితరములపై అవగాహన కల్పించారు. గతంలో ఈ పనులన్నీ చేయడానికి వేర్వేరుగా ఉండేవారని, గ్రామ పంచాయతీల్లో ఈ పనులన్నీ ప్రస్తుతం శిక్షణ పొందిన మంచినీటి సహాయకులే చేయాల్సి ఉంటుందని చెప్పారు. శిక్షణ పొందిన వర్కర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ గ్రిడ్ ఏఈ రమేష్, ఇంట్రా ఏఈ సుజిత తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని అప్పులమయం చేసిన బీఆర్ఎస్'



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

జూలూరుపాడు: పదేళ్ల పాలనలో తెలంగాణను బీఆర్ఎస్ అప్పులమయం చేశారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆరోపించారు. జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన 13మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 14మందికి రూ.3.39 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అలాగే మహిళలకు చీరలు అందజేశారు. మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయలేదన్నారు. తమ ప్రభుత్వం రూ.2లక్షల మేర మాఫీ చేసిందన్నారు. దీపావళి తరువాత రేషన్ కార్డులు, రైతు బీమా ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా, డిగ్రీ, డిప్లొమా కాలేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని చూడాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సూచించారు. సాగుభూములు, రహదారుల సమస్యలపై దళిత రైతులు, టీడీపీ నాయకులు చలమల గోవిందు, రోకటి నరసింహారావు, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని బీఎస్పీ నాయకుడు తంబర్ల నరసింహారావు వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎస్ఐ రాణాప్రతాప్, పీఆర్ ఏఈ నాగేంద్ర, ఎంపీఓ తులసీరాం, గిర్దావర్ తిరుపతిరావు నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, కొలిపాక వెంకటేశ్వర్లు, నున్నా కృష్ణయ్య, బానోత నవీన్, పోతురాజు నాగరాజు, మోదుగు రామకృష్ణ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో కోల్, ఓబీ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని టేకులపల్లి రాజకీయ, కార్మిక యూనియన్ల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్‌లో జీఎం పర్సనల్ పీఏ, డైరెక్టర్ పీఏలకు వినతిపత్రం అందజేశారు. కేటీసీలో కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, సేఫ్టీ వసతులు కల్పించకుండా, జీతాలు సమయానికి ఇవ్వకుండా, అడిగిన కార్మికులను డ్యూటీ ఆపుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఓసీలో 350 మంది పనిచేస్తుంటే 160 మందికి మాత్రమే బోనస్‌లు ఇచ్చారన్నారు. కార్మికులకు విశ్రాంతి గది కూడా లేదని, సేఫ్టీ విధానం కూడా లేదని, కార్మికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. తక్షణమే ఎల్ఎస్ఎన్ కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబాకుల ప్రసాద్, ధర్మపురి వీర బ్రహ్మాచారి, మాలోతు శివా నాయక్ పాల్గొన్నారు.

సమ్మె తాత్కాలిక విరమణ



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

టేకులపల్లి: వేతనాలు పెంచాలని కోరుతూ టీయూసీఐ మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్లు మంగళవారం దాసుతండాలో టిప్పర్ల అడ్డా వద్ద బైఠాయించి విధులకు వెళ్లకుండా సమ్మె ప్రారంభించారు. టిప్పర్ అసోసియేషన్ నాయకులు టీయూసీఐ నేతలను సంప్రదించి కార్మికుల వివరాలు తీసుకున్నారు. ఈనెల 28న యజమానులు, యూనియన్ నేతలు, కార్మికుల సమావేశంలో వేతనాల పెంపుపై చర్చిద్దామని కోరడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకూబ్‌షావలి, మోటారు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న తెలిపారు. చర్చలు సఫలం కాకపోతే మళ్లీ సమ్మె నిర్వహిస్తామని కార్మికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, నరసింహారావు, వరద రామచంద్రయ్య, జరుపుల సుందర్, మదార్, చింటూ, రాజేష్, చంటి, రమేష్ బాబు, నరసింహారావు రాజా, సురేష్ పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్యశిబిరం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన మాత రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యాన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.